సాక్షి ఒడిశా

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 3,73,390

బంగారం : 13.850 గ్రాములు

వెండి : 22.7 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



ముమ్మరంగా 'మూభీ మితా'

జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ 'మూభీ మితా' అనే ప్రచార కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు.

- 8లో




అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని రీక్లమేషన్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ లింగరాజ్ పండా, జిల్లా కలెక్టర్ విశాల్‌సింగ్ శనివారం సందర్శించారు.

- 8లో

తమ్ సూర్యం | ప్రణమామ్యహం

- కోణార్క్ సూర్యదేవాలయం పరిరక్షణకు సన్నాహాలు
- ఇసుక తొలగింపు పనుల ప్రారంభం



సూర్యదేవాలయం వద్ద పనులు

భువనేశ్వర్: ప్రపంచ ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయం పరిరక్షణ కార్యకలాపాలు మరోసారి ఊపందుకున్నాయి. భారత పురావస్తు శాఖ ఏఎస్‌ఐ ఈ ఆలయ పరిరక్షణ బాధ్యతలు చూస్తోంది. అయితే ఇక్కడ ఇసుక తొలగింపు చాలాకాలంగా ప్రహసనంగా సాగుతోంది. మొదలవ్వడం అప్పుడే ఆగిపోవడం జరుగుతోంది. ఎట్టకేలకు ఈ పనులకు మోక్షం లభించింది. దీర్ఘకాలం తర్వాత కోణార్క్ సూర్య దేవాలయం పరిరక్షణ పనులకు మరోసారి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆలయం నలు వైపులా ప్రధాన ప్రాకారానికి రక్షణ కల్పించే దిశలో చర్యలు చేపడుతున్నారు. వీటి పటిష్టత కోసం క్రేన్‌ల సహాయంతో బీమ్‌లు అమర్చుతున్నారు. చారిత్రాత్మక సూర్య దేవాలయ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఏఎస్‌ఐ వర్గాలు తెలిపాయి.

సున్నిత ప్రక్రియ..

ఆలయం నలు వైపులా బీమ్‌ల అమరిక చాలా సున్నితమైన ప్రక్రియ. దీంతో ఏఎస్‌ఐ అనుబంధ వర్గాలతో సమావేశాలు నిర్వహించింది. గత కొన్ని నెలలుగా ఆలయ ప్రాంగణంలో పడి ఉన్న ఇనుప బీమ్‌ల్ని ఆలయం నలు వైపుల ప్రధాన కట్టడాల పరిరక్షణ కోసం అమర్చేందుకు నిర్ణయించినట్లు ఏఎస్‌ఐ స్థానిక అధికారి దేవేంద్ర కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియ అత్యంత సున్నితమైనది. చాలా జాగ్రత్తగా చేపడుతున్నట్లు వివరించారు.

17 అడుగుల మేర ఇసుక..

సీబీఆర్‌ఐ సంస్థ ఆధ్వర్యంలో కోణార్క్ సూర్య దేవాలయం లోపలి స్థితిగతుల్ని సమీక్షించారు. ఈ నేపథ్యంలో లేజర్ స్కానింగ్ చేపట్టారు. ఈ పరిశీలనలో ఆలయం లోపల 17 అడుగుల వరకు ఇసుకతో పూడ్చివేసినట్లు తేలింది. ఈ నివేదిక ప్రకారం ఆలయంలో కూరుకుని ఉన్న ఇసుక తొలగింపు కార్యకలాపాలు చేపట్టడంపై భారత పురావస్తు శాఖ ఏఎస్‌ఐ పెద్దగా శ్రద్ధ కనబరచ లేదు. 2020 ఫిబ్రవరి 28, 29 తేదీలలో వరుసగా రెండు రోజులపాటు జరిగిన కోణార్క్ సూర్య దేవాలయ సంరక్షణ జాతీయ సదస్సు తీర్మానంతో ఇసుక తొలగింపు అనివార్యంగా మారింది. ఈ సదస్సులో అప్పటి భారత పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ ఉషా శర్మ, అప్పటి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ముఖ్య సలహాదారు ఆర్.బాలకృష్ణన్, సూర్యమందిర్ సంరక్షణ పర్యవేక్షణకు నియమితులైన ఆమికస్ క్యూరీ ఎన్‌కే మహంతి, ప్రముఖ పరిశోధకుడు అమియ భూషణ్ త్రిపాఠి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. వీరందరి ఉమ్మడి పరిశీలన మేరకు కోణార్క్ సూర్య దేవాలయ గర్భం నుంచి ఇసుక తొలగింపు అనివార్యమని తీర్మానించారు.



కళాకృతులు చెడకుండా..

ఇసుక తొలగింపు చేపట్టే ముందు ఆలయం నలు వైపులా సున్నితమైన ప్రధాన అంశాల పరిరక్షణ పట్ల దృష్టి సారించారు. ఈ భాగాల ప్రత్యేక పరిరక్షణ కోసం ఇనుప బీమ్‌లు ఏర్పాటు ప్రారంభించారు. ఆలయం వాస్తవ నిర్మాణ శైలి, కళాకృతులకు ఎలాంటి భంగం కలగకుండా గర్భంలో కూరుకుని ఉన్న ఇసుకని తొలగించేందుకు ఏఎస్‌ఐ నడుం బిగించింది. ఆలయం గుర్రపు ద్వారం, ఏనుగు ద్వారం పరిసరాల్లో సింగిల్ బీమ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ముఖ శాల ప్రాంగణం లోపల నుంచి ఇసుక తొలగించేందుకు అనుబంధ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ సంరక్షణ చర్యల్లో భాగంగా క్రేన్ సహాయంతో బీమ్‌ల అమరికకు ఏఎస్‌ఐ చర్యలు చేపడుతోంది. ఈ ప్రయత్నంలో ఆలయం అపురూప శిల్ప కళాకృతులకు ఏమాత్రం భంగం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఒక వర్గం అభిప్రాయపడింది.



న్యూస్‌రీల్

చోరీకి వచ్చి చిక్కారు



ఇంజిన్‌ను దొంగిలించేందుకు వచ్చిన యువకుల వీరే

జయపురం: చోరీ చేసేందుకు వచ్చిన ముగ్గురు యువకులు అడ్డంగా దొరికిపోయారు. ఈ ఘటన జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి ఖెందుపొడ గ్రామంలో జరిగింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖెందుపొడ గ్రామం బీరకంభ ఆలయం సమీపంలో మరమ్మతులకు గురైన ఓ ట్రాక్టర్ ఇంజిన్‌ను చోరీ చేసేందుకు శనివారం ముగ్గురు యువకులు ఆటోతో వచ్చారు. ఇంజిన్‌ను దొంగిలించే క్రమంలో కాపలాదారుడికి పట్టుబడడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. బొయిపరిగుడ పోలీసులు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం స్టేషన్‌కు తరలించారు. ఈ చోరీలో మరికొంత మంది పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

పర్లాకిమిడి: పాముకు కాటుకు ఓ వ్యక్తి బలయ్యాడు. గుసాని సమితి తాటిపట్టి పంచాయతీ గోలగాం గ్రామానికి చెందిన రఘునాథ నాయక్ (56) తన పొలంలో పనిచేస్తూ పుల్లలు ఏరే క్రమంలో పాముకాటు వేసింది. వెంటనే అప్రమత్తమైన బంధువులు గురండి ప్రాథమిక వైద్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. వైద్యులు సకాలంలో సరైన వైద్యం అందించలేదని అందుకే తన భర్త మృతి చెందారని భార్య ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విలేకర్లకు తెలిపారు.

దొంగలు అరెస్ట్

- నగదు, బైక్‌లు స్వాధీనం



గంగపూర్ పోలీసులు అరెస్ట్ చేసిన దోపిడీ దొంగలు



బీఎన్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేసిన దుండగులు

బరంపురం: గత కొంత కాలంగా దోపిడీలు చేసి తప్పించుకు తిరుగుతున్న రెండు ముఠాలకు చెందిన 8 మంది దోపిడీ దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీనా కేసుల వివరాలను శనివారం విలేకర్లకు తెలిపారు. గంజాం జిల్లా పట్టపూర్ బ్లాక్‌లో ఉదయపల్లి, అంకులి గ్రామాల్లో కొద్ది రోజుల క్రితం దోపిడీలు జరిగాయి. ఈ కేసులకు సంబంధించి ఎనిమిది మంది దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.21 వేల నగదుతో పాటు బైక్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

జంట హత్యల కేసులో మరో ముగ్గురు అరెస్టు



అరెస్టయిన నిందితులు

బరంపురం: బరంపురం నగర పరిధి మౌడా గ్రామంలో కొన్ని నెలల క్రితం ఇద్దరు హత్యకు గురయ్యారు. ఈ కేసులో మరో ముగ్గురిని అరెస్టు చేసినట్టు బరంపురం ఎస్పీ డాక్టర్ సార్వణ్ వివేక్ శనివారం తెలిపారు. జూన్ నెల 29వ తేదీన మౌడా గ్రామానికి చెందిన శిబరామ్ గౌడా, లిట్టురాజ్‌లను గ్రామస్తులు పెట్రోల్‌పోసి నిప్పంటించి హత్య చేసినట్టు పేర్కొన్నారు. ఈ కేసులో తాజాగా భగవాన్ సాహు, కృష్ణ సాహు, జయగురు దోళాయిలను అరెస్టు చేయగా.. ఇప్పటి వరకూ ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు.

ఏకలవ్య పాఠశాలలను సకాలంలో పూర్తి చేయాలి



ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ రూపా రోషన్ సాహు

- రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషనర్ రూపా రోషన్ సాహు
- గజపతి జిల్లాలో పర్యటన

పర్లాకిమిడి: ఏకలవ్య పాఠశాలల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనర్ రూపా రోషన్ సాహు అధికారులను ఆదేశించారు. గజపతి జిల్లాలో పర్యటన నిమిత్తం శనివారం విచ్చేసిన ఆయన జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, సమగ్ర గిరిజనాభివృద్ధి, స్పెషల్ డెవలప్‌మెంట్ చైర్మన్‌లతో కలిసి పాలనాధికారి కార్యాలయం హాలులో సమావేశమయ్యారు. సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖకు 2020–22, 2022–23 వార్షిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎంత నిధులు వచ్చాయి, ఎంత ఖర్చు జరిగిందో ఐటీడీఏ, డీఆర్‌డీఏ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్.ఉదయగిరి, రాయగడ, నువాగడ, గుమ్మా సమితిల్లో ఏకలవ్య ఆదివాసీ విద్యాలయాల నిర్మాణాలకు స్థలాలను కేటాయించడంతోపాటు, డీపీఆర్ అంచనాలు పంపాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. నాలుగో విడతలో వివిధ పాఠశాలలో 5–టీ ఆధ్వర్యంలో పాఠశాలల రూపాంతరీకరణ, స్మార్ట్ క్లాసులకు రాష్ట ప్రభుత్వం ఆమోదించిన నిధులు ఎంత వచ్చాయో ఆరా తీశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ రూపా రోషన్ అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఏడీఎం రాజేంద్రమింజ్, అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్‌దాస్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మమతాపరిడా, ఐటీడీఏ పీవో పాల్గుణి మరిఖి, జిల్లా పరిషత్ సీడీఎం గుణనిధి నాయక్ పాల్గొన్నారు.

భారీ ఎత్తున గంజాయి పట్టివేత



పద్మాపూర్‌లో గంజాయితో పోలీసులకు చిక్కిన నిందితుడు



మాచ్‌ఖండ్‌లో పట్టుబడిన గంజాయి

రాయగడ/కొరాపుట్: రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన సోదాల్లో భారీ ఎత్తున గంజాయి బయటపడింది. రాయగడ జిల్లా పద్మాపూర్‌లో శుక్రవారం 1730 కిలోల గంజాయిని పట్టుకున్నారు. గజపతి జిల్లా అటవీ ప్రాంతం నుండి జార్ఖండ్‌కు లారీలో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న క్రమంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో విషయం బయటపడింది. వెంటనే లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

కొరాపుట్ జిల్లా మాచ్‌ఖండ్‌లో..

కొరాపుట్ జిల్లా మాచ్‌ఖండ్ పరిధిలోని లమ్తాపుట్ ప్రాంతంలో శనివారం కారులో తరలిస్తున్న 25.2 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని యూపీలోని బెనారస్‌కు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితులు యూపీలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన సౌరభ్‌సింగ్, బహదూర్ సింగ్‌లుగా పోలీసులు గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

కోల్‌కతా బజార్‌కు తాళాలు



కోల్‌కతా బజార్ షాపునకు తాళాలు వేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది



డి.మహారాజా హోటల్ వంటగదికి తాళాలు వేస్తున్న మున్సిపల్ వర్కర్

జయపురం: జయపురం మున్సిపాలిటీ అధికారులు శనివారం పట్టణంలోని కోల్‌కతా బజార్ షాపులకు తాళాలు వేశారు. ఈ షాపుల ముందు వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయిక్ తెలిపారు. పలు మార్లు విజ్ఞప్తి చేశామని, నోటీసులు పంపినా పట్టించుకోలేదని దీంతో సీజ్ చేశామని తెలిపారు. షాపు యాజమాన్యం పార్కింగ్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాత తెరుస్తామని స్పష్టం చేశారు. అలాగే జయపురంలోని పలు ప్రాంతాల్లో హోటళ్లు, టిఫిన్ షాపులపై దాడులు చేశామన్నారు. మహారాజా హోటల్‌లో పరిశుభ్రత లేనందున ఏడు రోజులు సీజ్ చేశామని, రూ.2వేలు జరిమానా విధించామని తెలిపారు. మెయిన్ రోడ్డు, ప్రసాద రావు పేటలో నిర్వహిస్తున్న 10 చిన్న టిఫిన్ దుకాణాలపై కూడా రూ.5వేలు ఫైన్ వేశామన్నారు.

'ఎన్నికలకు సిద్ధం కావాలి'



మాట్లాడుతున్న జిన్నుహిక్కా

కొరాపుట్: కొరాపుట్ జిల్లా నారాయణ పట్న సమితి కేంద్రంలో శనివారం బిజూ జనతాదళ్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఆ పార్టీ సమితి అధ్యక్షుడు ఎస్.ఎగ్గి నారాయణ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ జిన్ను హిక్కా ప్రసంగించారు. ఆంధ్రా సరిహద్దులో తెలుగు భాష మాట్లాడేవారు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో పార్టీ పటిష్టతపై చర్చించారు. సమితిలోని 9 గ్రామ పంచాయతీల్లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రచారం చేయాలన్నారు. ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఆందోళన విరమణ



మిల్లు ప్రధాన గేటు తెరచి ఆందోళన విరమించిన కార్మికులు

జయపురం: జయపురం గగనాపూర్‌లోని పేపర్ మిల్లు కార్మికులు శుక్రవారం రాత్రి ఆందోళన విరమించారు. వీరు శుక్రవారం మిల్లు గేటుకు తాళాలు వేసిన సంగతి తెలిసిందే. బకాయి వేతనాలు చెల్లించాలని వీరంతా ఆందోళనకు దిగారు. వీరు గేటుకు తాళాలు వేసినప్పుడు లోపల కొందరు ఉండిపోయారు. బయట వారు లోపలకు వెళ్లలేకపోయారు. దీంతో మిల్లు యాజమాన్యం దిగి వచ్చింది. కార్మికులతో మాట్లాడి త్వరలో బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని వారంతా డిమాండ్ చేయడంతో సెప్టెంబర్ 6న చెల్లిస్తామని, జూన్ జీతం సెప్టెంబర్ ఆఖరులోగా చెల్లిస్తామని తెలిపారు. వీలైనంత త్వరగా మిల్లు నడిపేందుకు ప్రయత్నిస్తున్నామని హామీ పత్రంలో తెలిపారు. ఆ హామీ మేరకు ఆందోళన కారులు మిల్లు ప్రధాన గేటు తాళాలు తెరిచారు.

కొంధమాల్‌లో అలజడి

- ఛత్తీస్‌గఢ్ మావోలు తిష్ట వేసినట్లు సమాచారం



కొంధమాల్‌లో సీఆర్పీఎఫ్ జవాన్లు స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల డంప్



కొంధమాల్‌లో ఛత్తీస్‌గఢ్ మావోల శిక్షణ శిబిరం (ఫైల్)



కొంధమాల్ కళింగ ఘాటిపై కూంబింగ్ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు



పోడుకొట్ట దట్టమైన అటవీ ప్రాంతంలో కూంబింగ్

బరంపురం : కొంధమాల్‌పై ఎప్పుడో పట్టు కోల్పోయిన మావోయిస్టులు మళ్లీ అదే స్థలానికి చేరుకుంటున్నట్లు తెలుస్తోంది. వీరు చాప కింద నీరులా కొత్త దళాలను ఏర్పాటు చేస్తున్నారా? కొంధమాల్–కొలాహండి–గంజాం జిల్లాల సరిహద్దులను కారిడార్‌గా చేసుకొని కొంధమాల్‌లో తిష్ట వేశారా? అన్న అనుమానాలు ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతున్నాయి. కొన్ని రోజుల కిందట కొంధమాల్ జిల్లా పిరింగియా పోలీసు స్టేషన్ పరిధిలో గల కొమనకుల పంచాయతీ, కొంబలోడు గ్రామం దగ్గర పోడుకొట్ట ఘాటీ ప్రాంతంలో మావోల డంప్ బయట పడడంతో ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయి. కేకేబీఎన్ దళం మావోయిస్టుల డంపు బయటపడటంతో ఛత్తీస్‌గఢ్ నాయకులు కొన్ని అనుబంధ సంస్థలతో కలిసి కొంధమాల్–కలాహండి జిల్లాలను కలుపుకుని కొత్త దళం ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. పిరింగియా పోలీసు స్టేషన్ పరిధిలో గల కొమనకుల పంచాయతీ, కొంబలోడు గ్రామం దగ్గర పోడుకొట్ట ఘాటీ దట్టమైన అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం ఎస్‌ఓజీ జవాన్లు కూంబింగ్ చేస్తుండగా మావోల డంప్ దొరికిందని దక్షిణాంచల్ ఐజీ సత్యబ్రత బోయి తెలియజేశారు.

ముమ్మరంగా కూంబింగ్

కొంధమాల్ ఏఎస్పీ మినతి మిశ్రా, బౌద్ జిల్లా ఎస్పీ బి.గంగధర్, గంజాం జిల్లాకి చెందిన జగ్‌మోహన్ మీనాలు ఈ ఘటనపై అప్రమత్తమయ్యారు. కొంధమాల్–కొలాహండి–గంజాం జిల్లాల సరిహద్దుల్లోని బల్లిగుడా, రైకియా, బమ్ముణిగామ్, దరింగబడి, గజలబడి, కటింగియా, పాణిగొండా అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ ముమ్మరం చేశారు.

వడ్డీ వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకోండి



మీడియాతో మాట్లాడుతున్న మీనియక

రాయగడ: రుణాల పేరిట చిరు వ్యాపారులను దోచుకుంటున్న ఫైనాన్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షురాలు మంజుల మీనియక డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ వివేకానంద శర్మకు వినతి పత్రం సమర్పించారు. పరాయి ప్రాంత వ్యక్తులు రాయగడ వచ్చి ఫైనాన్స్ సంస్థలు నడిపిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వీటిని నడుపుతున్నారని, అధిక వడ్డీలు వసూలు చేస్తూ జనాలను పీడిస్తున్నారని, ఆ సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో బీజేపీ నాయకులు బసంత్ కుమార్ ఉల్కా, పద్మనాభ దాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూర్మనాథుని సన్నిధిలో హైకోర్టు జడ్జి రాజశేఖర్


శ్రీకూర్మనాథుని సన్నిధిలో హైకోర్టు జడ్జి రాజశేఖర్

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథుడిని హైకోర్టు న్యాయమూర్తి టి.రాజశేఖర్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు ఎదురేగి స్వాగతం పలికారు. ముందుగా మూలవిరాట్‌కు పూజల అనంతరం లక్ష్మీసన్నిధి, రెండు ధ్వజస్తంభాలు, వైష్ణవిదుర్గ, తాబేళ్ల పార్కును సందర్శించారు. ఆలయ ఈఓ జి.గురునాథం క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట అరవల రామకృష్ణ తదితరులున్నారు.

'రెడ్‌క్రాస్ సేవలు మరింత చేరువ కావాలి'


భూమి పూజ చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న రెండు సెంట్ల స్థలంలో రెడ్‌క్రాస్ పరిపాలన, నైపుణాభివృద్ధి భవన నిర్మాణానికి ఆయన శనివారం భూమిపూజ చేశారు. ఈ భవన నిర్మాణంతో మరింత మెరుగైన సేవలు అందజేయడానికి అవకాశం ఉందన్నారు. దీని ద్వారా భవిష్యత్‌లో అనేక శిక్షణ కార్యక్రమాలు, విపత్తులు, ఫస్ట్ ఎయిడ్, జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ తదితర కార్యక్రమాలు చేపట్టవచ్చని తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు విస్తరించడంలో ముందుంటామని, మగటపల్లి వెంకటరమణమూర్తి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ, సహకారంతో పనులు ప్రారంభం చేస్తామని తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

కోటబొమ్మాళి: మండలం నిమ్మాడ జంక్షన్‌లోని పెదకోట శ్రీకాంత్‌కు చెందిన బైక్ చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాంత్ ఆమదాలవలసకు చెందిన తన మేన మామ బజాజ్ బైక్‌ను వాడేందుకు ఇంటికి తెచ్చుకున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి తన ఇంటిముందు పెట్టి నిద్రపోయాడు. శనివారం ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. వెతికినా దొరకలేదు. దీంతో బాధితుడు కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ విశ్వేశ్వరరావు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

సరుబుజ్జిలి: మండలంలోని చినకాగితాపల్లి పంచాయతీ శాస్త్రులపేట గ్రామానికి చెందిన చిట్టివలస సత్తిరాజు(30) శనివారం తన ఇంటికి సమపంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య కుమారి, ఏడేళ్ల వయస్సు గల పాప ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్తిరాజు గుంటూరులో స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న సమయంలో విజయనగరం జిల్లా మెంటాడకు చెందిన కుమారి అనే అమ్మాయితో 2014లో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారడంతో 2015లో వీరిరువురు ప్రేమ వివాహం చేసుకున్నారు. 2016 వీరికి ఒక పాప పుట్టింది. అయితే 2021 నుంచి తన భర్త తన వద్దకు రావడం లేదని ఆమె ఆంధ్ర పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యాభర్తలను స్టేషన్‌కు పిలిచి సక్రమంగా కాపురం చేసుకోమని కౌన్సిలింగ్ ఇచ్చారు. మూడు రోజుల కిందట సత్తిరాజు స్వగ్రామం శాస్త్రులుపేట వచ్చాడు. అప్పటి నుంచి దిగాలుగా కనిపించేవాడు. అదే మనస్తాపంతో శనివారం తన ఇంటి సమీపంలో ఉన్న చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. వెంటనే మృతుని తల్లి గ్రామస్తులను పిలవగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించినట్లు ఎస్‌ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ తెలిపారు.

వీరావల్‌లో జిల్లా మత్స్యకారుడు మృతి

రణస్థలం: మండలంలోని ఎన్‌జీఆర్ పురం పంచాయతీలో గల పోతయ్యపేట గ్రామానికి చెందిన చీకటి అప్పారావు(49) గుజరాత్ రాష్ట్రం వీరావల్‌లో మరణించినట్లు మండల మత్స్యశాఖ అధికారి గంగాధర్, గ్రామ పెద్దలు పిల్లా తాత, ఎంపీటీసీ ఉప్పాడ అప్పన్నలు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గుజరాత్ రాష్ట్రంలోని సోమనాథ్ జిల్లా వీరావల్ ప్రాంతానికి కొన్ని రోజుల కిందట అప్పారావు వలస వెళ్లారు. అక్కడ బోటులో వేట సాగిస్తుండగా గత నెల 30వ తేదీన వేటకు ఉపయోగించిన వస్తువు ప్రమాదవశాత్తు పొట్టలో తగిలిందని తెలిపారు. వెంటనే రాత్రికి ఒడ్డుకు చేరుకుని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించినట్లు చెప్పారు. మృతునికి భార్య దానేసు, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు కూడా తండ్రితో పాటు గుజరాత్ వేటకు వెళ్లారని తెలిపారు. భార్య, వివాహిత అయిన కుమార్తె పోతయ్యపేటలో ఉంటున్నారు. విషయం తెలిసి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ముమ్మరంగా 'మూభీ మితా'

పర్లాకిమిడి: జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ 'మూభీ మితా' అనే ప్రచార కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టరేట్ హాల్‌లో కాలేజీ విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, డిప్యూటీ కలెక్టర్ కుముంద దళబెహరా, సబ్ కలెక్టర్ కార్యాలయం అదనపు కలెక్టర్ రాజేంద్ర భుయ్యాన్ ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ వార్డుల్లో ఓటర్లతో కలిసి వారి ఆధార్ కార్డుతో ఓటరు కార్డు లింకేజీ, ఓటరు కార్డులో తప్పుల సవరణ వంటి వివరాలు తెలియజేయాలని కలెక్టర్ కోరారు.



ప్రచారంలో భాగంగా కలెక్టర్‌తో విద్యార్థులు

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన


పిల్లలతో మాట్లాడుతున్న అధికారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని రీక్లమేషన్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ లింగరాజ్ పండా, జిల్లా కలెక్టర్ విశాల్‌సింగ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లలకు ప్రతి నెల పెడుతున్న ఆహారం ఎలా అందుతుందో అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. పోషకాహారం తీసుకునే విధానంపై గర్భిణులకు పలు సూచనలు చేశారు. మాండీయాతో చేసిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుందని వివరించారు. అనంతరం సిబ్బందితో చర్చించారు.


సిబ్బందితో చర్చిస్తున్న ఉన్నతాధికారులు

కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ అధికారిణి బిపులకుమారి శారదర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి మమతా చౌదరి తదితరులున్నారు.

కనీస మద్దతు ధర ప్రకటించాలి


బొయిపరిగుడలో ర్యాలీ నిర్వహిస్తున్న కృషక సభ ప్రతినిధులు, రైతులు

- స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి
- కొరాపుట్ జిల్లా కృషక సభ నేతలు

జయపురం: వ్యవసాయ వైజ్ఞానికులు ఎం.ఎస్.స్వామినాథన్ వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన మార్పులపై చేసిన సిఫార్సులను వెంటనే అమలు చేయాలని, అలాగే ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.4 వేలు ప్రకటించాలని అఖిల భారత కృషక సభ బొయిపరిగుడ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం బొయిపరిగుడలో భారీ ర్యాలీ నిర్వహించింది. కొరాపుట్ జిల్లా కృషక సభ నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. ర్యాలీ 326 జాతీయ రహదారి మీదుగా బొయిపరిగుడ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా కృషక సభ కార్యదర్శి జుధిష్టర రాళో ఆధ్వర్యంలో బీడీఓకు వినతిపత్రం అందజేశారు. రైతులకు వడ్డీ లేని వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని, పాత రుణాలు రద్దుచేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలని, వ్యవసాయ నల్ల చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని, 2005 చట్టం ప్రకారం గ్రామీణ నియుక్తి పథకంలో భాగంగా ప్రతీ శ్రామికునికి ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని కోరారు. నియుక్తి పథకంలో చేపట్టే పనులను యంత్రాలతో చేయించటం నిషేధించాలన్నారు.


బొయిపరిగుడ బీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా కార్యదర్శి జుధిష్టర్ రాళో

వ్యవసాయ అధికారుల ఆందోళన


ఆందోళన చేపడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

పర్లాకిమిడి: స్థానిక జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మట్టి సంరక్షణ శాఖ అధికారులు శనివారం నుంచి నిరవధిక ఆందోళన చేస్తున్నారు. వ్యవసాయ విస్తరణ సహాయ అధికారి, సంఘం అధ్యక్షుడు సురేష్ కుమార్ పట్నాయక్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ, ఉద్యానవనాలు, మట్టి సంరక్షణ అధికారుల క్యాడర్ మార్పుపై అనేక ఏళ్లుగా డిమాండు చేస్తున్నామన్నారు. గత నెల 31న ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ అధికారులకు అల్టిమేటం జారీ చేశామన్నారు. ప్రభుత్వం తమ క్యాడర్ పెంపుపై ప్రకటన చేయలేదని, అందువల్ల తామంతా సామూహికంగా సెలవులు పెట్టి శాంతియుతంగా ఆందోళన చేస్తున్నామన్నారు. ఈ ఆందోళనలో వ్యవసాయ విస్తరణ అధికారి అవినాష్ పట్నాయక్, జిల్లా ఉద్యానవన శాఖ, మట్టి సంరక్షణ అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి రూ.50వేలు విరాళం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాతశ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం అభివృద్ధి కోసం రూ.50వేలు విరాళాన్ని వరం చారిటబుల్ ట్రస్టు తరఫున శనివారం సాయంత్రం అందించారు. ట్రస్టు ప్రతినిధులు అంధవరపు ప్రసాద్, సంతోష్, పైడిశెట్టి జయంతి తమ తండ్రి అంధవరపు వరాహ నరసింహం జ్ఞాపకార్థం ఈ విరాళం అందించారు.

పంచాయతీ కార్యాలయం ముట్టడి


సంజయ కుమార్ పండాకు సమస్యలు వివరిస్తున్న యువకులు

- ప్రజా సమస్యలు పరిష్కరించాలని కాత్రగడ గ్రామస్తుల డిమాండ్

జయపురం: ప్రజా సమస్యలు పరిష్కరించాలని జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి కాత్రగడ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని జీపీ డెవలప్‌మెంట్ యూత్ గ్రూప్ ఆర్గనైజర్ గోపాల డొంగిరి నాయకత్వంలో యువకులు శనివారం ఆందోళన చేపట్టారు. ప్రధాన మంత్రి అవాస్ యోజనలో జరుగుతున్న అక్రమాలు, మహాత్మ గాంధీ గ్రామీణ నియుక్తి యోజనలో అవినీతి, రహదారులు లేక గ్రామీణ ప్రజలు పడుతున్న ఇక్కట్లు, విద్యుత్ దీపాల సమస్య, కాత్రగడలో మంగళవారం వార సంత పరిశుభ్రత తదితర సమస్యలపై పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. కాత్రగడ పంచాయతీలోని సమస్యలపై ఆందోళన చేపడుతున్నా సర్పంచ్ కుని సౌర రాకపోవడం అన్యాయమని గోపాల డొంగిరి అన్నారు. యువకులు ఆందోళన చేపడతారని తెలిసి గ్రామ పంచాయతీ కార్యనిర్వాహక అధికారి రాకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీలోని మరో అధికారి సంజయ కుమార్ పండాతో సమస్యలపై చర్చించారు. గ్రామ పంచాయతీకి వివిధ పథకాల ద్వారా అభివృద్ధి పనులకు ఎంత నిధులు వచ్చాయి, ఏయే పనులకు ఎంత ఖర్చు అయిందో తెలియజేయాలని యువకులు డిమాండ్ చేశారు. యువకుల డిమాండ్లపై పండా ఎటువంటి హామీ ఇవ్వలేదు. సర్పంచ్, పంచాయతీ అధికారి ఉన్న సమయంలో తాము మరలా వచ్చి వినతిపత్రం అందజేస్తామని, తమకు సరైన వివరాలు, అభివృద్ధి పనుల ఖర్చులు తెలియజేయాలన్నారు. లేకపోతే మళ్లీ పంచాయతీ సమితి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో డెవలప్‌మెంట్ యూత్ గ్రూప్ ఉపాధ్యక్షుడు శివ ప్రధాని, కోశాధికారి శామ్యూల్ డొంగిరి, కార్యదర్శి బైద్యనాథ్ హరిజన్, ఆకాశ డొంగిరి తదితరులు పాల్గొన్నారు.

పీఈఓల ఆందోళన


పీఈఓలకు సంఘీభావం తెలియజేస్తున్న ఎమ్మెల్యే నిత్యానంద గొండో, బీజేపీ నాయకులు

- బీజేపీ ఎమ్మెల్యే సంఘీభావం

కొరాపుట్: రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్న పంచాయతీ ఎక్స్‌టెన్షన్ అధికారుల (పీఈఓ) ఆందోళనకు బీజేపీకి చెందిన ఉమ్మర్ కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గొండో శనివారం సంఘీభావం తెలిపారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద పీఈఓలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఈఓలకు గ్రేడ్ పే చెల్లించాలని, వారి నియమాకాలను ప్లస్ టు నుంచి ప్లస్ త్రీకి విద్యా అర్హత పెంచాలని, ప్రతీ పదేళ్లకు ఒకసారి ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లపై ఈ ఏడాది ఆగస్టు 7 నుంచి 17వ తేదీ వరకు నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారన్నారు. ప్రస్తుతం నిరవధికంగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నబరంగ్‌పూర్ మున్సిపల్ చైర్మన్ కున్ను నాయక్, బీజేపీ సీనియర్ నాయకుడు గౌరీ శంకర్ మజ్జి పాల్గొన్నారు.

కళాకారులతో సంక్షేమ పథకాలపై ప్రచారం

- పర్లాకిమిడిలో రెండు రోజుల శిక్షణ


మాట్లాడుతున్న అధికారులు

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గజపతి జిల్లాలోని జానపద కళాకారుల ద్వారా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా కళాప్రదర్శనలు ఇచ్చేందుకు ఎంపికైన కళాకారులకు రెండు రోజుల పాటు జిల్లా సాంస్కృతిక శాఖ ద్వారా ఇవ్వనున్న శిక్షణ తరగతులు స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ప్రారంభమయ్యాయి. అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్‌దాస్ ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జానపద కళాకారులు బుర్రకథ, గస్కాటియా, గుర్రం ఆట, పల్లా ప్రదర్శనలు ఇచ్చి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకూ జిల్లాలో ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. జిల్లా సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్, జిల్లా ముఖ్యశిక్షాధికారి ఈశాన్ చంద్ ఉకార్, జిల్లా సమాచార శాఖ అధికారి ప్రదిప్త గురుమయి, జిల్లాసామాజిక సురక్షా అధికారి సంతోష్ కుమార్ నాయక్, ఒడిశా ఆదర్శ విద్యాలయాల అధికారులు పాల్గొన్నారు.


శిక్షణ శిబిరానికి హాజరైన జానపద కళాకారులు

ఊరికి ఆర్థిక ఊతం

- 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు
- మౌలిక వసతులకు ప్రాధాన్యం
- 30 మండలాల్లోని 912 పంచాయతీలకు రూ.36,09,22,655

వజ్రపుకొత్తూరు: ఊరికి ఆర్థిక ఊతం లభించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా పల్లెకు పాలన చేరువ చేసింది. అంతే కాకుండా ప్రాధాన్యత క్రమంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పుడు తాజాగా 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఇటీవల మొదట విడత రూ.360,922,655 నిధులను విడుదల చేశారు.

మొత్తం 30 మండలాల్లోని 912 పంచాయతీలకు గాను టైడ్ నిధులు కింద రూ.217,297,271, అన్‌టైడ్ నిధులు కింద రూ.143,625,384 కలిసి రూ.360,922,655 పీడీ ఖాతాలకు జమ కానున్నాయి. పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చెల్లించేందుకు వీలుగా ఆర్థిక స్వాతంత్య్రం కల్పించారు. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీల్లో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ–పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ లావాదేవీల వివరాల సమాచారం ఎప్పటికప్పుడు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు తెలుస్తుంది. ప్రభుత్వ ట్రెజరీ అనుమతులు లేదా ఇతర ఉన్నతాధికారులు జోక్యం కూడా ఎక్కడా ఉండదని డీఎల్‌పీఓ ఐవీ రమణ వెల్లడించారు.


కొత్తపేట గ్రామ సచివాలయం

విధివిధానాలివే..
పంచాయతీలకు జమ అయిన నిధులను టైడ్, అన్‌టైడ్ భాగాలుగా విడగొట్టి మొదటి భాగంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, కరెంటు బిల్లుల చెల్లింపు, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాలి. వీటితో పాటు శ్మశాన వాటికల అభివృద్ధికి కూడా వినియోగించుకోవచ్చు. ఈ– పంచాయతీ నిర్వహణకు కంప్యూటర్ విడిభాగాలు కొనుగోలు చేసుకునేందుకు కూడా వినియోగించుకోవచ్చు. రెండో భాగంలో ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు, చేతి పంపులు, నీటి ట్యాంక్‌లు, మోటార్‌ల నిర్వహణ బాధ్యతను ఆయా పంచాయతీలే చూసుకోవాలి. అవసరమైతే మరమ్మతులు చేసుకోవాలి. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలతో పంచాయతీ సర్పంచ్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మార్గదర్శకాల ప్రకారం ఖర్చు



కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన మొదటి విడత 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల పీడీ ఖాతాలకు జమ చేశాం. ఈ నిధులకు సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. ప్రాధాన్యత, మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేసి, సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. వివిధ అభివృద్ధి పనులకు వినియోగించిన నిధులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ–పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ బిల్లులపై ప్రభుత్వం ఏటా ఆడిట్ నిర్వహిస్తుంది. కొన్ని పంచాయతీల్లో కరెంటు బిల్లుల బకాయిలు ఉన్నాయి. అవి కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుంది. మార్గదర్శకాలు అతిక్రమించి ఖర్చు చేస్తే సంబంధిత సర్పంచ్, కార్యదర్శులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.
– ఐవీ రమణ, డీఎల్‌పీఓ టెక్కలి

నాటక కళకు జీవం


వెంకటరావును సత్కరిస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: రంగస్థల కళాకారుల సమాఖ్య నాటక కళకు జీవం పోస్తోందని గార ఎంపీపీ గొండు రఘురాం అన్నారు. స్థానిక బాపూజీ కళామందిరంలో శ్రీకాకుళ రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం 287వ నెల కార్యక్రమం శనివారం జరిగింది. సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు పన్నాల నర్సింహమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఒక కార్యక్రమం నిర్వహిస్తూ అనేక రకాల కళలను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. వీరి కృషిని చూసి తన వంతుగా రూ.5వేలు విరాళం అందిస్తున్నానని తెలిపారు. పేద కళాకారులకు నెలవారీ పింఛను అతిథులు అందించారు. రూ.3వేలుతో రచయిత వెంకటరావును సత్కరించగా, ఆ సొమ్మును సమాఖ్యకు విరాళంగా అందించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన
ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో 'ఆసరసాల' నాటిక ప్రదర్శన చక్కగా సాగింది. మూల నాటకాన్ని గంటేడ గౌరునాయుడు రచించగా నాటకీకరణను తాళాబత్తుల వెంకటేశ్వరరావు చేశారు. ఎల్.రామలింగస్వామి దర్శకత్వం వహించారు. ఇందులో కె.శాంతారాం, ఇంజరాపు రమణరావు, ప్రసాద్ రౌళో, చిట్టి వేంకటరావు, మెహర్ ప్రభాకర్, బంటుపల్లి రామచంద్రదేవ్, కేశిరెడ్డి రాజేశ్వరీ, బత్తుల లక్ష్మీ నటించారు. సంగీతం లీలామోహన్ అందించగా రంగాలంకరణ ఎస్.రమణారావు సమకూర్చారు.

క్లుప్తంగా

ఆహా క్యాంటీన్ ప్రారంభం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూల సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఆహా క్యాంటీన్‌ను శనివారం ఏర్పాటు చేశారు. స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్‌ను పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన, రుచికరమైన ఆహారం ఇక్కడ తక్కువ ధరకే అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రధానంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు ఈ క్యాంటీన్ ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, చైర్మన్ యందవ రాధాకుమారి, వైస్‌చైర్మన్ రౌతు హనుమంతురావు, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ట్రాన్స్‌కో ఏఈ



కార్యాలయంలో జేఈ శాంతారావు

మక్కువ: మక్కువ విద్యుత్‌శాఖ ఏఈ పి.శాంతారావు శనివారం విధుల్లో చేరారు. విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకున్న ఆయన కార్యాలయంలో 15నిమిషాలు పాటు ఉండి, వెళ్లినట్లు తెలిసింది. వ్యవసాయవిద్యుత్ కనెక్షన్ అందించేందుకు ఏఈ శాంతారావు గతనెల 27వతేదీన పాపయ్యవలస గ్రామం సమీపంలో ఓ రైతునుంచి రూ. 40వేలు తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు రంగప్రవేశం చేయడంతో కారుతో పరారైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గాలింపు చేపట్టిన ఏసీబీ అధికారులు విశాఖపట్నంలో ఏఈ శాంతారావును శుక్రవారం పట్టుకున్నారు. శనివారం విజయనగరం, మక్కువలో ఆయన నివాసముంటున్న ఇళ్లలో సోదాలు నిర్వహించారు. కోర్టు ఆదేశాల మేరకు ఏఈ శాంతారావుకు స్టేషన్‌బెయిల్ మంజూరు చేసినట్లు ఏసీబీ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఏఈకి 41ఎ నోటీస్

విజయనగరం క్రైమ్: సుప్రీంకోర్టు నిబంధనల మేరకు ట్రాన్స్‌కో ఏఈకి 41ఎ నోటీస్ ఇచ్చి విడుదల చేసినట్లు ఏసీబీ డీఎస్పీ పి.రామచంద్రరావు శనివారం పేర్కొన్నారు.

గోవిందుడికి ప్రత్యేక పూజలు



తోటపల్లిలో నిర్వహించిన అన్నదానం

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికంగా తరలి వచ్చారు. భక్తులకు ఆలయ సిబ్బంది, అర్చకులు ప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం పార్వతీపురానికి చెందిన ద్వారపురెడ్డి శ్రీనివాసరావు సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పలుతీర్మానాలు

శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీకోదండరామస్వామి ఆలయాల అభివృద్ధికి ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. కోదండ రామాలయంలో తాత్కాలిక అర్చకుల నియామకం, జనరేటర్ మరమ్మతులు, శిథిలావస్థలో ఉన్న కేశఖండన శాలను టూరిజం బిల్డింగ్ పక్కకు మార్చడం, టూరిజం బిల్డింగ్‌కు మరమ్మతులు, పార్వతీపురం-పాలకొండ వెళ్లే బస్సులకు తోటపల్లివద్ద బస్టాప్ ఏర్పాటుచేయడానికి చేసిన ప్రతిపాదనలను ఏకగ్రీవంగా తీర్మానించారు.

యువకుడి ఆత్మహత్య




ఫ్యాన్‌కు వేలాడుతున్న ఈశ్వరరావు మృతదేహం

పాచిపెంట: ఫ్యాన్‌కు ఉరేసుకుని, యువకుడు అలజంగి ఈశ్వరరావు(31) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన మండలంలోని మోసూరు గ్రామంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ ఫక్రుద్దీన్ వివరాలిలా ఉన్నాయి.. మోసూరుకు చెందిన ఈశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. 2017లో కులాంతర వివాహం అనంతరం అతడు గ్రామంలోనే ఫ్యాన్సీ, పాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ మధ్యకాలంలో సొంతింటి నిర్మాణం కూడా ప్రారంభించాడు. వ్యాపారం కలిసి రాకపోవడం, ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి కూడా బానిసయ్యాడు. అప్పుల భారం గురించే రోజూ ఆలోచిస్తూ తీవ్ర మనస్తాపానికి గురైన అతడు ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం సాలూరు పీహెచ్‌సీకి మృతదేహం తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

ఆటకు రా..!

- స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీలకు సర్కారు గ్రీన్‌సిగ్నల్
- నెలాఖరులోగా జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక
- జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయికి





స్కూల్‌గేమ్స్ నిర్వహణపై చర్చిస్తున్న డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ

విజయనగరం: పుస్తకాలతో కుస్తీ పడుతున్న పాఠశాల స్థాయి విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి ఏడాదీ నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ పోటీలకు ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చేసింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో అండర్-14,17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికల క్రీడాపోటీలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు విజయనగరం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణతో విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి క్రీడాపోటీల నిర్వహణపై చర్చించి షెడ్యూల్‌ను శనివారం ఖరారు చేశారు. జిల్లాలో గల మండల, నియోజకవర్గ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కో ఆర్డినేటర్‌లుగా వ్యవహరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేదేశాలకు అనుగుణంగా కో ఆర్డినేటర్‌లు ఈనెల 10వ తేదీలోగా మండల స్థాయి, 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయి, 21 నుంచి వచ్చే నెల 15లోగా జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు సెక్రటరీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధర్వంలో నిర్వహించాలని ఆదేశించారు.

9 క్రీడాంశాల్లో మండల, నియోజకవర్గ స్థాయి పోటీలు

2023-24 విద్యా సంవత్సరంలో స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీలకు సంబంధించి మండల, నియోజకవర్గ స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బాడ్మింటన్, త్రో బాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ క్రీడలకు సంబంధించి ఎంపికలు నిర్వహించనున్నారు. మరో 21 క్రీడాంశాల్లో నేరుగా జిల్లాస్థాయిలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం పోటీలు నిర్వహించనున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు విజయవంతంగా నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని ప్రోత్సహించాలని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సూచించారు.

పారదర్శకంగా క్రీడాకారుల ఎంపిక

ఏటా పాఠశాల విద్యార్థులకు నిర్వహించే అండర్-14,17 స్కూల్ గేమ్స్ పోటీల నిర్వహణకు ప్రణాళిక సిద్ధమైంది. 9 క్రీడాంశాల్లో మండల స్థాయి నుంచి ఎంపిక పోటీలు నిర్వహించనుండగా..మరో 21 క్రీడాంశాల్లో నేరుగా జిల్లాస్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తాం. ఎంపిక పోటీల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించాం. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా స్థాయి పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.

ఎల్‌వీ రమణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి, విజయనగరం జిల్లా

అంకిత భావంతో విధులు



శిక్షణలోవు ఉన్న ట్రైనీ ఐఏఎస్ అభ్యర్థులతో కలెక్టర్ నిషాంత్ కుమార్

- ట్రైనీ ఐఏఎస్‌ల బృందానికి కలెక్టర్ సూచన

పార్వతీపురం: అంకిత భావంతో విధులు నిర్వహించి, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలవాలని, శిక్షణలో ఉన్న సివిల్ సర్వీసెస్ బ్యాచ్ అభ్యర్థులకు కలెక్టర్ నిషాంత్ కుమార్ సూచించారు. సివిల్ సర్వీసెస్ బ్యాచ్ అభ్యర్థులు పార్వతీపురం మన్యం జిల్లాలో పది రోజులుగా అధ్యయనం చేస్తూ వివిధ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నిషాంత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్ నిషాంత్ కుమార్ వారికి వివరించారు. సివిల్ సర్వీసెస్ అధికారులుగా వివిధ ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పని చేయాల్సి వస్తుందని, ఆయా ప్రాంతాల్లో భౌగోళిక స్థితిగతులు, సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని, తదనుగుణంగా మంచి ప్రణాళికలు రూపకల్పన చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత పర్యటన గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహనకు దోహదం చేస్తుందన్నారు. ప్రజలకు చేరువ కావడం అత్యావశ్యమని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంలో సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. యువ అధికారులుగా సమాజ సేవలో నిమగ్నం కావాలని, భవిష్యత్తులో మంచి అధికారులుగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి, శిక్షణలో ఉన్న సివిల్ సర్వీసెస్ బ్యాచ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

టవర్లు, ఓఎఫ్‌సీ కేబుల్స్ ఏర్పాటుకు అనుమతులు

జిల్లాలో మొబైల్ టవర్ల నిర్మాణం, ఓఎఫ్‌సీ కేబుల్స్ వేసేందుకు జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం తీసుకుందని కలెక్టర్ నిషాంత్ కుమార్ పేర్కొన్నారు. ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో మూడు బీఎస్‌ఎన్‌ఎల్, ఒక ఎయిర్ టెల్ టవర్, ఓఎఫ్‌సీ కేబుల్స్, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 2 ఎయిర్ టెల్, 8 బీఎస్‌ఎన్‌ఎల్ ఓఎఫ్‌సీ కేబుల్స్, రెండు జియో టవర్ల నిర్మాణానికి స్థలాలకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. రెవెన్యూ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా తనిఖీ నిర్వహించిన మేరకు స్థలాలు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు కల్పనాకుమారి, సి.విష్ణు చరణ్, జిల్లా అటవీ అధికారి జీఏపీ ప్రసూన, ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారి ఎం.జేమ్స్, పార్వతీపురం ఐటీడీఏ ఏపీఓ ఎ.మురళీధర్, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, జియో ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ: వ్యక్తికి తీవ్రగాయాలు



ఘటన స్థలంలో చెల్లాచెదురైన బైక్‌లు

కొత్తవలస: అరకు-విశాఖపట్నం రోడ్డులో ని నిమ్మలపాలెం సమీపంలో సూర్య ఐటీఐ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బి.సాయి అనే వ్యక్తికి తీవ్రగాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యా యి. వివరాలిలా ఉన్నాయి.. ఎస్.కోట మండలం, ఆలుబిల్లు గ్రా మానికి చెందిన సాయి తన బైక్‌పై కొత్తవలస నుంచి ఎస్.కోట వైపు వెళ్తుండగా, ఒంగోలు జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు ఎస్.కోట నుంచి కొత్తవలస వైపు బైక్‌పై వెళ్తున్నారు. సరిగ్గా సూర్య ఐటీఐ సమీపానికి వచ్చేసరికి ఎదురెదురుగా వస్తున్న వీరి బైక్‌లు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. దీంతో సాయి కుడికాలు తొడ భాగం ఎముక విరిగిపోగా, మిగిలిన ఇద్దరు యువకులు స్వలంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సృష్టిలో దృష్టి కీలకం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు
- నేత్రదానంపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్:

సృష్టిలో మానవునికి అన్నిటికంటే అపురూపమైనది దృష్టి అని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు శనివారం పార్వతీపురంలోని కొత్తవలస సచివాలయం పరిధిలో నవిరి కాలనీలో నేత్రదానంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కంటి ఆరోగ్యం, సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్నియా ప్రాముఖ్యాన్ని గుర్తించి నేత్రదానం చేయడానికి ముందుకు రావాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశంలో 68 లక్షల మంది ఒకటి లేదా రెండు కళ్లలో కార్నియా అంధత్వంతో బాధపడుతున్నారని, వారిలో 10 లక్షల మంది రెండు కళ్లకూ కార్నియా అంధత్వం వల్ల పూర్తిగా దృష్టి కోల్పోయారన్నారు. ఎక్కువ మంది చిన్నారులు గాయాల బారిన పడడం, కంటిలో రసాయనాలు లేదా ఇతర దుమ్ము, ధూళి పడడం వల్ల, వ్యవసాయం చేసే వారిలో వరి రేకు, చెరుకు రేకు కంటికి తగిలినప్పుడు సకాలంలో సరైన చికిత్స పొందకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల శాశ్వతంగా అంధత్వం పొందుతున్నారన్నారు. నేత్రదానానికి వయసు, కులం, మతం, లింగ భేదం లేదని, అందరూ నేత్రదానం చేయవచ్చని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్, జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్త సుజాత, నేత్ర సహాయకులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

13 నుంచి జేఎన్‌టీయూ జీవీలో 'ఇన్నో ఎక్స్‌పో 360 హాకథాన్'



పోస్టర్‌ను విడుదల చేస్తున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు 'ఇన్నో ఎక్స్‌పో 360 హాకథాన్' సదస్సులు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ తెలిపారు. ఇంజినీరింగ్ డే సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు సదస్సు షెడ్యూల్, ప్రచార పోస్టర్‌ను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య శనివారం విడుదల చేశారు. విద్యార్థుల్లో పరిశోధన దృక్పథాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ హాకథాన్ ప్రదర్శనలో విజేతలను ఈ నెల 15వ తేదీన ఇంజినీర్స్ డే రోజున ప్రకటించి విజేతలకు రూ.లక్ష నగదు బహుమతి అందజేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, డైరెక్టర్లు ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ప్రొఫెసర్లు డి.రాజ్యలక్ష్మి, కె.చంద్రభూషణరావు, కో-ఆర్డినేటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ బి.తిరుమలరావు, సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ పి.అరుణ కుమారి పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్



అరెస్టయిన నిందితుడితో సీఐ అప్పలనాయుడు, తదితరులు

గజపతినగరం:

వాహనాల చోరీ కేసుకు సంబంధించి, పార్వతీపురం మండలం, పిన్నింటి రామినాయుడువలస గ్రామానికి చెందిన మరిపి గోవిందరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. శనివారం ఇదే విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన సీఐ గజపతినగరం రైల్వేస్టేషన్ వద్ద మూడు ద్విచక్ర వాహనాలు, దత్తిరాజేరు మండలంలోని కోమటిపల్లి రైల్వేస్టేషన్ వద్ద మరో ద్విచక్ర వాహనాన్ని సదరు నిందితుడు అపహరించినట్లు వెల్లడించారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు గజపతినగరం ఎస్‌ఐ గంగరాజు, మానాపురం ఇన్‌చార్జ్ ఎస్‌ఐ జి.రాజేష్ కలిసి మానాపురం రైల్వేగేటు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా, నిందితుడు గోవిందరా వు పట్టుబడ్డాడని, వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని, అతడి దగ్గర నుంచి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయగరం జిల్లాలోని వివిధ శాఖల్లోని విభిన్న ప్రతిభావంతుల కేటగిరీ బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్ జాబితా(1:3 నిష్పత్తి ప్రాతిపదికన)ను విడుదల చేశామని ప్రతిభావంతులు, హిజ్రాలు, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.వి.బి.జగదీష్ తెలిపారు. 2023 మార్చిలో జారీ చేసిన నోటిఫికేషన్ అనుసరించి, అప్పట్లో విడుదల చేసిన అనర్హుల జాబితా అభ్యర్థుల అభ్యంతరాల పరిశీలన పూర్తి చేసుకుని, క్లాస్-4 పోస్టుల్లో ఆఫీస్ సబార్డినేట్(ఓహెచ్ జనరల్), నైట్ వాచ్‌మెన్(వీహెచ్ జనరల్), ఏఎన్‌ఎం(ఓహెచ్ మహిళల కేటగిరీ)లో జేసీ ఆమోదంతో అభ్యర్థుల మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. గ్రూప్-4లోని జూనియర్ అసిస్టెంట్లు, మిగిలిన క్లాస్-4 పోస్టులకు సంబంధించి, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జరుగుతోందన్నారు. పూర్తి వివరాల కోసం 08922-274647 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఈఎస్‌ఐ ఆస్పత్రి సమీపంలో వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక బొగ్గులదిబ్బ ఈఎస్‌ఐ ఆస్పత్రి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. మృతుడి వయసు 30 నుంచి 35 ఏళ్లు ఉంటాయని, కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ బి.వెంకటరావు కోరారు.

పిడుగుపాటుకు 8 మేకలు మృత్యువాత

సాలూరు: పిడుగుపాటుకు గురై, 8 మేకలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని వెలగవలస సమీపంలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. మరిపల్లి గ్రామానికి చెందిన కొండ్రు తిరుపతి, మీసాల సత్యం తమ మేకల మందతో వెలగవలస గ్రామం మీదుగా వస్తుండగా, ఈక్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో అక్కడి బంగారమ్మ ఆలయ సమీపంలోని చెట్టు వద్దకు మేకలు చేరుకుంటుండగా, అకస్మాత్తుగా మందలోని మేకలపై పిడుగుపడింది. దీంతో అందులోని 8 మేకలు మృతి చెందాయి. దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వచ్చిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని మేకల యజమానులు కోరుతున్నారు.

పిడుగుపాటుకు కొబ్బరిచెట్టు దగ్ధం

గజపతినగరం: పిడుగుపాటుకు గురై, కొబ్బరి చెట్టు దగ్ధమైన ఘటన గజపతినగరం మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి, ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో పాటు భారీ ఈదురుగాలులు వీచాయి. ఈ క్రమంలో అకస్మాత్తుగా సచివాలయం-1 వెనుక భాగంలోని కొబ్బరిచెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగాయి. సచివాలయ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారి ఎం.ఎస్.వి.రవిప్రసాద్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. అప్పటికే చెట్టు పైభాగం పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం.

మళ్లీ గాండ్రింపు



వీరఘట్టం మండలం కంబర వట్టిగెడ్డ ప్రాంతంలో లభించిన పులి పాదముద్రలు

- వీరఘట్టం మండలంలో సంచరించిన పులి
- ఆందోళనలో కంబర గ్రామ పరిసర ప్రాంతాలు
- పాదముద్రలు నిర్ధారించిన ఫారెస్ట్ అధికారులు



గ్రామ సమీప తోటల్లో ఉన్నవారికి అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ గార్డ్

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం మండలం కంబర గ్రామం శనివారం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్రామ సమీపంలోని వట్టిగెడ్డకు వెళ్లే తోవలో పులి సంచరించినట్లు పాదముద్రలు కనిపించడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో సెక్షన్ ఆఫీసర్ రవిబాబు, సిబ్బందితో వచ్చి పాదముద్రలు పరిశీలించి కొలతలు వేశారు. ఆ పాదముద్రలు పులివేనని నిర్ధారించారు. కొంతదూరం వరకు పాదముద్రలు ఉండడంతో సమీపంలోని తోటల్లో పరిశీలించారు. ప్రస్తుతం పులి కురుపాం రేంజ్ అటవీప్రాంతం వైపు వెళ్లినట్లు అంచనా వేసి రవిబాబు తెలిపారు. గతంలో కాకినాడ నుంచి బొబ్బిలి వైపు తర్వాత వంగర మండలంలో సంచరించిన పులి ఇదేనని ఆయన స్పష్టం చేశారు. ఆగస్టు 15న కడకెల్ల సమీపంలో సంచరించినట్లు పాదముద్రల ద్వారా గుర్తించామన్నారు. ఆగస్టు 16న దోనుబాయి అటవీ ప్రాంతం వైపు వెళ్లిందని, అక్కడి నుంచి బత్తిలి, తర్వాత సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట వైపు సంచరించిందని వివరించారు. తాజాగా శుక్రవారం సీతంపేట-దోనుబాయి మధ్యలో గెడ్డగూడ, కోసంగి ప్రాంతాల్లో పులి సంచరించినట్లు కొందరు చూసినట్లు చెప్పారు. పులి తొలుత సంచరించిన ప్రాంతాల వైపు మళ్లీ వచ్చే ఆస్కారమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పులి కనిపిస్తే జాగ్రత్తలు తప్పనిసరి

పులిపాదముద్రలు గమనించిన తరువాత ఉత్సుకతతో వెంబడించి పులి కోసం అన్వేషించకుండా తక్షణమే సురక్షితమైన ప్రదేశానికి చేరుకుని అటవీ శాఖకు సమాచారం అందించాలని ఆ శాఖ అధికారులు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు అవగాహన కల్పిస్తూ తెలియజేసిన జాగ్రత్తలు వారి మాటల్లోనే..

- పులి సాధారణంగా మట్టి రోడ్లలో సంచరిస్తుంది కావున గ్రామాలలో సంచరించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా పొలం పనులకు వెళ్లే రైతులు, స్కూల్‌కు వెళ్లే పిల్లలు ఒంటరిగా వెళ్లవద్దు.
- నీటి వనరుల సమీపంలో పులి సంచరించే అవకాశాలు చాలా ఎక్కువ కాబట్టి గ్రామ సమీపంలో గల చెరువులు, గెడ్డలు, నదులు, కాలువల దగ్గరకు వెళ్లేటప్పుడు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలి.
- పులి వెంబడించి ఛేజ్ చెయ్యడాన్ని ఇష్టపడుతుంది కాబట్టి పులిని ఎవరైనా దగ్గర నుంచి చూసినట్లయితే ఆకస్మాత్తుగా పరిగెత్తకుండా, ఎటువంటి కదలిక ఇవ్వకుండా నిదానంగా, నిశ్శబ్దంగా, ఆ ప్రాంతం నుంచి దూరంగా వెళ్లిపోవాలి.
- పులి కనిపించినపుడు, దాని కళ్లలో కళ్లు పెట్టి చూడరాదు. భయంతో మూత్ర విసర్జన చేయరాదు. ఎందుకంటే మూత్ర వాసన బట్టి పులి దాడి చేసే అవకాశం ఉంది. ఎటువంటి మారణాయుధాలు ఉపయోగించి కొట్టే ప్రయత్నం చేయరాదు. అలా చేస్తే పులి వెంటనే దాడి చేస్తుంది.
- పెంపుడు జంతువులైన ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలపై పులి దాడి చేస్తే వెంటనే అటవీ శాఖాధికారులకు సమాచారం అందించాలి.
- పులి కనిపించినప్పుడు, యువత బాధ్యతతో వ్యవహరించాలి. గ్రామాల్లోని వృద్ధులు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. పులిని ఫొటో తీయడం గాని, రెచ్చగొట్టి, కవ్వించే చర్యలు చేయరాదంటూ అటవీశాఖాధికారులు వివరించారు.

సీతంపేటలో వ్యవసాయ శిక్షణ శిబిరం



వ్యవసాయ క్షేత్ర సందర్శన నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సీతంపేట: సీతంపేట వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ పి.సీతారాము పార్వతీపురం మన్యం జిల్లా స్థాయి వ్యవసాయ శిక్షణ, వర్క్‌షాప్‌ను శనివారం నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్లలో వ్యవసాయ సమస్యలు, పంటలు వాటి వివరాలు, పోషక లోపాలపై చర్చించారు. వాటికి అవసరమైన సస్యపోషణ, సస్యరక్షణ, మేలైన యాజమాన్య పద్ధతులపై సీతంపేట వ్యవసాయ పరిశోధన కేంద్రం, రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వివరించారు. ఐటీడీఏ పీఏఓ హరికృష్ణ, వ్యవసాయ సంచాలకులు టి.వెంకటేష్, కె.రత్నకుమారి, ఎం.మధుసూదనరావు, శాస్త్రవేత్తలు ఎల్.లక్ష్మీనారాయణ, పి.సౌజన్య, అమృతవాణి, డాక్టర్ వై.ఉమాజ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు.